# డెడ్ బాడీ



మహారాజశ్రీ స్టేషన్ డైరక్టర్ గారికి,
ఆకాశవాణి కేంద్రం,
పోర్ట్ బ్లెయిర్
అండమాన్ దీవులు

అయ్యా—

దయవేసి ఈ దిగువ నుదహరించిన విషయాన్ని మీరు ప్రాంతీయ వార్తల్లో ఈరోజు సాయంత్రం, రేపు ఉదయం ప్రసారం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

"ఈరోజు అంటే గురువారం ది 9.3.88 తెల్లవారు జామున సుమారు నాలుగు గంటల ప్రాంతంలో మినీబేలోని ఒక చెట్టుకు ఒక కుర్రవాని శవం వేలాడుతున్నట్లు మాకు ఫిర్యాదు వేయబడింది. నల్లగా, ధృడంగా వున్న ఈ కుర్రవాని శవం వంటి మీద నల్లని నైలాను నిక్కరు, ఎరుపు రంగు బనీను వున్నవి. చేతికి కాశీ దారం కట్టబడి వున్నది. ఈ చనిపోయిన వ్యక్తి పొడవు అయిదు అడుగుల నాలుగు అంగుళాలు. ఛాతీ విస్తీర్ణం 30 అంగుళాలు. గిరజాల జుట్టు. నుదుటిమీద చిన్న కాలినమచ్చ. చుట్టుపక్కల విచారించగా, ఈ చనిపోయిన వ్యక్తి గురించి ఎవరికీ తెలియదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురిలో వుంచారు. ఈ చనిపోయిన వ్యక్తి తాలూకు వారు ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వివరాలు అందజేసి, శవాన్ని గుర్తుపడితే శవాన్ని అతని బంధువులకు అప్పగించడం జరుగుతుంది".

ఈ వార్తను రేడియోలో ప్రసారం చేయగలరు.

అభివందనాలతో

శెట్లు
స్టేషన్ హౌసు ఆఫీసరు
అబర్డాన్ బజారు,
పోలీసు స్టేషను, పోర్ట్ బ్లెయిర్.

పోర్ట్ బ్లెయిర్
తేదీ : 9.3.88

ఈ ఉత్తరాన్ని సాయంత్రం అయిదుగంటలకు రేడియో స్టేషన్‌లోని డ్యూటి ఆఫీసరుకు పోలీసు కానిస్టేబుల్ తీసుకునివచ్చి, సంతకం చేయించుకుని ఇచ్చి మరీ వెళ్లాడు. ప్రాంతీయ వార్తల్లో చెప్పమని వున్నది కనుక ఆ ఉత్తరాన్ని న్యూస్ ఎడిటర్‌కు పంపాడు ఆ డ్యూటీ ఆఫీసరు.

ప్రాంతీయ వార్తల్లో ఈ వార్తచోటు చేసుకోలేదు. "ఇట్లాంటివి న్యూస్ బుల్‌లెటిన్‌లో చెప్పకూడదు. స్థానిక ప్రకటనల్లో మీరు చెప్పుకోండి" అని ఆ కాగితం మీద వ్రాసి రాత్రి 7.30 గంటలకు ఆ కాగితాన్ని న్యూస్ ఎడిటర్ డ్యూటీ రూంకు తిప్పి పంపాడు.

అప్పటికే ఆ పూట స్థానిక ప్రకటనల ప్రసార పమయం కూడా అయిపోయింది. కనీసం మర్నాటి పొద్దున అయినా ప్రసారం వేద్దామని డైరక్టరు గారి అనుమతికోసం ఆయన ఇంటికి ఫోన్ వేశాడు డ్యూటీ ఆఫీసరు. డైరక్టరుగారు శ్రీమతితో ఎంచక్కా షికారుకు వెళ్ళారట. ఎప్పుడు వస్తారో తెలియదని నౌకరు జవాబు.

పట్టువదలని విక్రమార్కుడిలాగా అసిస్టెంట్ డైరక్టరు గారికి డ్యూటీ ఆఫీసరు ఫోన్ వేశాడు. "ఇది పాలసీకి సంబంధించినది. రేపు ఉదయం పదిగంటలకు మీటింగులో డైరక్టరు గారితో చర్చించి, నిర్ణయం తీసుకోవాలి. అంత వరకూ ఆ కాగితాన్ని అట్లాగే వుంచు" అని ఆదేశించారు అసిస్టెంట్ డైరక్టర్

ఈలోగా తను పంపిన సమాచారం ప్రసారం కాలేదనీ, శవం కుళ్ళి పోయే స్థితికి వస్తుందని ఆసుపత్రి అధికారులు గొడవచేస్తున్నారనీ, సబ్ ఇన్స్పెక్టరుగారు న్యూస్ ఎడిటర్‌గారి ఇంటికి ఫోన్ వేశారు. న్యూస్ ఎడిటర్ అది మాకు సంబంధించికాదు. మీరు డ్యూటీ రూంను కాంటాక్టు వేయండి అన్నాడు. డ్యూటీ రూంను కాంటాక్టు వేస్తే మీరు మా అసిస్టెంట్ డైరక్టర్ గారితో మాట్లాడండి అన్నాడు డ్యూటీ ఆఫీసరు. ఆయనకు రింగ్ వేస్తే "త్వరలోనే ఒక నిర్ణయం తీసుకొంటాం" అన్న సమాధానం వచ్చింది.

★★★★

మర్నాడు శుక్రవారం — ఉదయం — 10 గంటలు. డైరక్టరుగారి చాంబర్‌లో అసిస్టెంట్ డైరక్టరు, ఇతర ప్రోగ్రాం ఆఫీసర్లు కలసి డెడ్ బాడీని గురించి ప్రాంతీయ వార్తల్లో చెప్పాలా లేద స్థానిక ప్రకటనల్లో ప్రసారం వేయాలా? అని చర్చ ప్రారంభించారు. చర్చ క్రమంగా వార్తయొక్క ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని వదిలిపెట్టి, న్యూస్ ఎడిటర్‌ను, న్యూస్ పాలసీని విమర్శించడంతో ముగిసింది. చివరికి డైరెక్టటర్‌గారు తీసుకొన్న నిర్ణయం ఏమిటంటే "న్యూస్ ఎడిటర్ — ప్లీజ్ డిస్కస్".

ఆ సాయంత్రం న్యూస్ బులిటెన్ తయారు చేయడానికి వచ్చిన ఎడిటర్‌గార్కి ఆకాగితం మళ్ళీ తన టేబుల్ మీద కనిపించగానే డెడ్‌బాడీ తనని వెక్కిరిస్తున్నట్లు భావించాడు. అప్పటికే డైరక్టరు గారు ఇంటికి వెళ్ళిపోయారు కనుక ఫోనులో కంటే స్వయంగా తనే తర్వాత మాట్లాడవచ్చని ఆ కాగితాన్ని పక్కన పడేసి తన పని చూసుకోసాగాడు.

ఆ మర్నాడు రెండవ శనివారం. ఆ తర్వాత ఆదివారం. సోమవారం ఉదయం పదిగంటలకు న్యూస్ ఎడిటర్ ఆ కాగితాన్ని పట్టుకుని డైరెక్టరు గారి దగ్గరి కెళ్లారు. (ఇక్కడొక విషయం చెప్పాలి. రేడియో స్టేషన్‌లోని న్యూస్ ఎడిటర్ డైరక్టరుకు బాధ్యుడు కాదు. ఢిల్లీలోని న్యూస్ డైరక్టరు అధీనంలో వాళ్ళు పని చేస్తుంటారు.)

"ఇట్లాంటి ప్రకటనలు న్యూస్‌లో ఇవ్వటానికి వీలులేదు. ఇది మా న్యూస్ పాలసీకి విరుద్ధం. కావాలంటే మీరు మీ స్థానిక ప్రకటనల్లో ఇచ్చుకోండి" అని ఆ కాగితాన్ని తిరిగి డైరక్టరు గారి టేబుల్ మీద పడేశాడు.

డైరక్టరుగారి అహం దెబ్బతిన్నది. "సరే! ఇది న్యూస్‌లో ఎందుకు ప్రసారం కాదో నేను చూస్తాను. ఇప్పుడే ఈ మేటర్‌ను హెడ్ క్వార్టర్స్‌కు రిఫర్ చేస్తాను" అని వెంటనే బజర్ నొక్కి పి.ఏ.ను పిలిచి లెటర్ డిక్టేట్ చేయసాగాడు....

అప్పటికి అయిదు రోజులైంది. అటు ప్రాంతీయ వార్తల్లో కానీ — ఇటు స్థానిక ప్రకటనల్లో కానీ ఆచూకీ తెలియని శవాన్ని గురించిన సమాచారం ప్రసారం కాలేదు.

ప్రభుత్వ ఆసుపత్రిలోని "డెడ్‌బాడీ" అటు ప్రాంతీయ వార్తల మధ్య, ఇటు స్థానిక ప్రకటనల మధ్యా వేళ్లాడుతూ, కంపు కొడుతూవున్నది.

గమనిక : (అండమాన దీవుల్లో ఇట్లాంటి సమాచారాన్ని నలుగురికి వెంటనే తెలియజేయ్యాలంటే అందుబాటులో వున్న ప్రచార సాధనం రేడియో ఒక్కటే. ముఖ్య భూమిలోలాగా ఇక్కడ వార్తా పత్రికలు లేవు.)

## యస్.వి.ప్రసాద్



## తప్పేముంది? అంటున్న దివ్య

టాలెంట్ అన్నది చాలా ముఖ్యం కానీ అందంగా కనిపించడం కూడా ముఖ్యమే కదా! పాత్రపరంగా ఒంపు సొంపులు చూపించాల్సి వచ్చినప్పుడు చూపిస్తే తప్పేముంది అనడుగుతోంది దివ్య భారతి. మరి ఆమె దృష్టిలో తప్పేమిటో!

## తిండిపోతు 'రాయుడు'

ఆహారం తినడం మనిషికి చాలా అవసరం. ప్రాణంతో జీవించాలంటే అది తప్పదు. ఆ తినే కార్యక్రమాన్ని పిచ్చిగా, వెర్రిగా, వింతగా నిర్వహిస్తూ చూసేవారిచేత 'బాబోయ్ ' అనిపించే తిండిపోతు రాయుడు ఒకడున్నాడంటే నమ్ముతారా! ఇంగ్లాండ్ దేశంలోని కెంటీ నివాసియైన "నికోలస్‌వుడ్" అనే మానవుడు మహా ఆహార ప్రియుడు. ఆయనకు ఎంత తిండి పెట్టినా, 'ఇంకొంచెం వుందా' అన్నట్లు దిక్కులు చూస్తాడు. ఆయన ఒక విందుకు హాజరయ్యి, మూడు వందల అరవై పావురాల మాంసంతో చేసిన కూరను సరదాగా తినేసి "కొంచెం ఆకలి తీరినట్లుగా వుంది' అన్నట్లుగా చూశాడట. మరొక సందర్భంలో ఎనభైనాలుగు కుందేళ్ళ మాంసంతో వండిన కూరనంతా సింపుల్‌గా తనే తినేసి 'బ్రేవ్' అని తేన్చేడట. ప్రతిపూట తన ఇంట్లో కేవలం ఒకే ఒక మేక మాంసం అంత ఆహారాన్ని మాత్రమే తిని సర్దుబాటు చేసుకొంటాడట.

— నవ్జాజీ